# రేపటికి వెలుగు

'పైడిపాల'

"మహారాజా రాజశ్రీ రాజమార్తాండ, మూరు రాయర గండ, చండ పరాక్రమ విరాజిత దోర్దండ. . .డ. . .డాం. . .డ. . .డాం. . . డ... శ్రీ శ్రీ శ్రీ వీర పురుషోత్తమవర్మ ప్రభువులుం గారికి బహుపరాక్. . .బహుపరాక్. . ."

వందిమాగధుల స్తోత్ర పాఠాలతో మహారాజా గారికి తెల్లవారింది. సౌఖశాయనికుల కుశల పరామర్శకు అన్యమనస్కంగా తలూపిన మహారాజా అంతలోనే తేరుకున్నాడు.

"రాత్రి మూడో జాములో పరాకాక పీడ కల వచ్చింది. దానిని రాజపురోహితులు బిల్హణులవారి కెరింగింపవలె. వారిని సమాలోచన మందిరానికి తోడ్కొని రావలసినదిగా మహామంత్రి సుమంత్రుల వారికి మా ఆజ్ఞగా తెలియజేయుడు."

"చిత్తం, మహాప్రభూ" అత్యంత విధేయులైన వారు వంగి వంగి నమస్కరించి సెలవు తీసుకున్నారు.

మహారాజా పురుషోత్తమవర్మ ఆ రోజు ప్రభాత వాహ్యాళికి వెళ్ళకపోవడం జీను వేసి అశ్వాన్ని సిద్ధంగా ఉంచిన పరిచారకునికి ఆశ్చర్యం కలిగించింది.

మంగళ స్నానాది నిత్యకృత్యాల్ని నిర్వహించే మందిరాంగనలందరూ అప్రసన్న గంభీరమైన రాజ వదనాన్ని చూసి చకితులయ్యారు. భూపాలరాగ మంటే చెవి కోసుకొనే మహారాజా ఆ ఉదయం తన అంతఃపురంలో ఉండి కూడా తన వీణా వాదనాన్ని వినిపించుకోని వింత వైఖరికి రాణి రాగిణీ దేవి కలత పడింది. ఇష్టదైవం వేణుగోపాలస్వామికి పూజాదికాలు హడావిడిగా ముగించి వెళ్ళిపోతున్న మహారాజుని చూసి కలవరపడింది. అందుకే ఆయన ననుసరించి విశేషాలను సేకరించుకొని రమ్మని ప్రధాన పరిచారిక చారుమతి నాదేశించింది.

చారుమతి ఆలస్యం రాణికి అసహనాన్ని, ఆగ్రహాన్ని కలిగించినా ఆమె వచ్చిన వెంటనే విన్నవించిన కారణాలు వాటిని పటాపంచలు చేశాయి.

"ప్రభువుకు వచ్చిన పీడ కల ఏమిటో?" రాణి ఆత్రంగా అడిగింది.

"చనిపోయిన సింహ కళేబరం మీదుగా కొన్ని మదపుటేనుగులు పడిపోతున్న దృశ్యం ప్రభువులను కలలో కలవరపెట్టిందట."

"దీనికి బిల్హణుల వారు చెప్పిన వ్యాఖ్యాన మేమిటి?"

"శత్రువులు లేని ప్రభువుల అధికారాన్ని ఆయన అనంతరం శత్రువులు హస్తగతం చేసుకొనే ప్రమాదాన్ని కులదేవతలు ఈ విధంగా సూచించారట. కనుక ఎవరినైనా దత్తత చేసుకొని వారసుని నిర్ణయించమని..."

"ఇంతకూ మహారాజా ఏ నిర్ణయం తీసుకున్నారు?"

"తమకు సోదరతుల్యులైన నృసింహ వర్మ కుమారుని దత్తత చేసుకోవాలని మహారాజా సంకల్పం. దత్తత వలన ప్రభువులకు పుత్రప్రాప్తికి కూడా అవకాశమున్నదని బిల్హణులవారి అభిప్రాయం."

రాగిణి పెదవులపై ఒక శుష్కహాసం మెరిసి మాయమైంది. ఆమె భ్రుకుటి ముడిపడింది.

"ఆ పుత్రోదయం ఏ దేవేరివలన కలుగుతుందో కూడా సెలవిచ్చారా?"

"లేదు. మహారాజుకు అత్యంత ప్రీతిపాత్రులు... అష్ట సఖులలో ఇష్టసఖియైన విహంగిని తప్ప ఆ అదృష్టం మరెవ్వరిని వరిస్తుంది?"

"బాగుంది. అది మన చేతుల్లో ఉందా? ఏమైనా ఈ నిర్ణయం ప్రమాదకరం. ఇది నా ఆశయానికి అశనిపాతం."

"మహారాజా ఈ ఆలోచనని మీకు కూడా ముందుగా చెప్పకపోవడం విడ్డూరమే."

"ఆలోచనలతో నాకు శిరోభారంగా ఉంది. అలా ఉద్యానవనంలోకి వెళ్ళి కూర్చుందామా?"

చారుమతి రాగిణీదేవి ననుసరించింది.

అమలాపుర సంస్థానాధీశ్వరుడైన వీరపురుషోత్తమ వర్మ ముద్దుల రాణి రాగిణి దేవి. సంతానం కోసం ఎనిమిది మంది భార్యలను వివాహం చేసుకొని ఆఖరికి రాగిణీ దేవివల్ల కూడా ఆ భాగ్యం కలగక పోవడంతో ఇక పెళ్ళిళ్ళ ప్రయత్నం విరమించాడు. దానికి రాగిణీదేవి మీద ఉండే అంతులేని అనురాగం కూడా ఒక కారణమని ఆంతరంగికుల అభిప్రాయం. సంతానం కోసం రాజా చెయ్యని పూజల్లేవు. వ్రతాల్లేవు. రాజుకి వృద్ధాప్యం సమీపిస్తున్నా, ఆ మధుర సమాచారాన్నందించిన మదవతులెవరూ లేరు. కాని రాజ పురోహితుడు, ప్రఖ్యాత జ్యోతిశ్శాస్త్రవేత్త అయిన బిల్హణుడు మాత్రం రాజుకు సంతాన యోగం ఉందని మొదటి నుంచీ చెపుతున్నాడు. దానికి దత్తత కుమారుని పెంచుకోవడం కూడా ఒక సాధనమని సూచించడంతో రాజు తన సవతి తమ్ముడు నృసింహవర్మ కుమారుణ్ణి దత్తత చేసుకున్నాడు.

దత్తత కార్యక్రమం ముగిసి నెల తిరగ్గానే రాగిణీదేవి నెల తప్పిందనే వార్త అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచేసింది. రాజుగారు ఆనందంతో తలమునకలయ్యారు. బిల్హణుని జ్యోతిషం నిజమయినందుకు ఆయనకు ఘనసత్కారం జరిగింది. ఆ వార్తను మోసుకొచ్చిన చారుమతికి రత్నాల హారం బహుమతిగా అందింది. పురుషోత్తమవర్మ రాగిణీదేవిని అనురాగవాహినిలో ఓలలాడించి, ఆమెను అపురూపంగా కాలు కింద మోపకుండా చూసుకుంటున్నాడు. రాగిణి అదృష్టం చూసి మిగిలిన సవతులకు కన్ను కుట్టింది. అసూయతో రాగిణిని అంతం చెయ్యడానికి అనేక ప్రయత్నాలు చేశారు. కాని అవన్నీ చారుమతి చాకచక్యంవల్ల విఫలమయ్యాయి. చారుమతి పర్యవేక్షణలో సకల సౌకర్యాలు సమకూర్చబడిన రాగిణీదేవి తొమ్మిది నెలలు ముగిసీ ముగియగానే పండంటి మగబిడ్డను ప్రసవించిందనే వార్త మహారాజా మక్కిరి బిక్కిరి చేసింది. ఒక శుభముహూర్తాన పొత్తిళ్ళలోని పసికందుని దర్శించిన పురుషోత్తమవర్మ ఆనంద పరవశుడయాడు.

"దేవీ. . .బిడ్డ ముఖంలో రాజసం ఉట్టి పడుతూంది సుమా."


"అన్నీ తమరి పోలికలు."

"కాదు. దేవిగారి పోలికలే. తల్లి పోలిక లున్న తనయుడు అదృష్టవంతుడట. ఈ చిన్ని మగవాడు ఎంత మొనగాడవుతాడో!" "మహారాజా మనస్సులో ఆనంద తరంగాలు ఉరకలేస్తున్నాయి.

నవ్వులతో, తుళ్ళులతో, పసి పాప కేరింతలతో అంతఃపురం అంతటా ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయి. . .

## 2

"పూర్వ కాలంలో మీరు ఏ రాజవంశంలోనో పుట్టుంటారు" ఇనుప పెట్టె దగ్గర బాసింపట్టు వేసుకొని కూర్చొని ఆరోసారి డబ్బు లెక్కిస్తున్న పురుషోత్తాన్ని చూసి నవ్వుతూంది దేవి-



"ఎందుకని?" తల కూడా తిప్పకుండా లెక్కల్లో నిమగ్నమై పోయాడు పురుషోత్తం.

"పూర్వం రాజులు ఏ రాజసూయ యాగమో తలపెట్టి ఇతర రాజ్యాల మీద దండెత్తి ధన కనక వస్తువాహనాదులు కొల్లగొట్టుకొని వచ్చి ఖజానాలు నింపుకొనేవారట. ఈ ఇరవయ్యో శతాబ్దంలో మీరు సత్యనారాయణ వ్రతం పేరుతో. . ." దేవి మునిపంట నొక్కిన అధరం మీద దరహాసం.

"దేవీ, స్టుపిడ్. . గోడలకు చెవులుంటాయి. ఐనా ఇలా అనుకుంటారనే పెద్ద మొత్తాలు, ఖరీదైన బహుమతులు ఇచ్చే పార్టీలను వ్రతంలో చదివించకుండా ఇంట్లోకి తీసుకొచ్చి ఇమ్మన్నాను. అసలే ప్రభుత్వం మా 'టాక్స్ ఆఫీసర్ల' మీద నిఘా వేసి ఉంచుతూంది. ఓర్వలేని వారెవరైనా ఇలా సత్యనారాయణవ్రతం చేసి ఉన్నవాళ్ళను కొల్లగొడుతున్నామని కంప్లెయింటు ఇస్తే ఉద్యోగం కాస్తా వూడిపోదూ? ఉదయమే ఈ వస్తువులు షాపుకి తీసుకెళ్ళి సొమ్ము చేసుకోవాలి."

"ఈ 'టు ఇన్ వన్ స్టీరియో', 'ఫ్రిజ' లేటెస్ట్ మోడల్స్. . ఇవి ఉంచి కావాలంటే పాతవి అమ్మేయండి." దేవి ఫోమ్ బెడ్ మీద బోర్లా పడుకుని చుబుకాన్ని అరచేతుల మధ్య ఆనించి పురుషోత్తం కేసి చూస్తూంది.



"నో, ప్లీజ్... కొత్తవన్నీ ఒకేసారి ఎలా కొన్నామని ఆరా వస్తుంది."

"కనీసం ఈ వాషింగ్ మెషిన్ అయినా. . ." ఆమె కళ్ళు గోముగా మెరిశాయి.

"అదొక్కటే ఉంచుకుందువుగాని.."

"నిజానికి ఇప్పుడు కానుకల రూపంలో వచ్చిన ఫర్నిచర్ అంతా లేటెస్ట్ డిజయినే. ఇవి కూడా ఉంచుకుంటే—ఏ పాపో పుడితే అది కాపురానికి వెళ్ళేటప్పుడు కానుకలుగా ఇవ్వచ్చు."

"మరీ అంత దురాశ పనికి రాదు. పాపో, బాబో పుట్టారి కాని ఇలాంటి వస్తువులు సంపాదించడం ఘనకార్యం కాదు. వాళ్ళ పుట్టిన వేడుక, పుట్టిన రోజుల వేడుక. . .మేరేజెస్. . .ఓహ్. . .అవకాశాలు వచ్చినప్పుడల్లా వ్రతాలు చెయ్యక మానతామా? అందుకని ముందు వాళ్ళు పుట్టే మార్గం ఆలోచించు."

"యూ—నాటీ. . .నేనేం చెయ్యను? మీకెంత సేపూ డబ్బు ధ్యాస తప్ప నా గురించి పట్టించుకొనే తీరిక కూడానా?"

"ఇప్పటికి ఇల్లు కట్టడం పూర్తయింది. ఇక ముందు ఇల్లాలి సేవే. వచ్చే వారం తిరుపతి వెళ్ళి వెంకటేశ్వరస్వామి ముడుపు హుండీలో వేసి—కొడుకు పుడితే కొండకు నడిచి వస్తామని మొక్కుకొని వచ్చేద్దాం. సరేనా? వస్తూ వస్తూ నెల్లూరులో ఆగి, అక్కడ చిన్మయానంద యోగి అనే ఆంజనేయ ఉపాసకు డొకాయన ఉన్నారట—ఆయన దర్శనం చేసుకుందాం. ఆయనిచ్చే కుంకుమ ధరిస్తే చాలు, చాలా మందికి తలుచుకున్న పనులు పూర్తవుతున్నాయట."

"చాల్లెండి. సంపాదన పెరిగేకొద్దీ మీకు భక్తి కూడా అదే నిష్పత్తిలో పెరిగిపోతూంది. ఇలా మంత్రాలకు చింతకాయలు రాలతాయంటే నేను నమ్మను."

"అయితే భారత కాలంలో వరాలవల్ల సంతానం కలగడం—కట్టుకథలేనంటావా?"

"సంతానం కలగడం కథ కాకపోవచ్చు—కాని కేవలం వరంవల్ల నంటేనే సందేహం."

"దేవి. . .నువ్వు కథలు రాయడం మొదలు పెట్టినప్పటి నుంచీ మరీ హేతువాదినై పోతున్నావ్. పత్రికలు చదివి ఈ ఆడాళ్ళంతా పాడై పోతున్నారు."

"క్రూడ్ స్టేట్‌మెంట్. . . పత్రికలంటే గుర్తొచ్చింది. . .మొన్న పత్రికలో 'టెస్ట్ ట్యూబ్ బేబీ' గురించి చదివాను. విదేశాల్లోనే కాదు. ఇండియాలో కూడా ఈ ప్రయోగాలు చేస్తున్నారట."

"అందుకని మనం డాక్టర్లచేత పరీక్షలు చేయించుకొని. . .కృత్రిమ పద్ధతుల్లో పరాయివాళ్ళ వల్ల సంతానం కందామంటావా?—నో...ఐ హేటిట్. అది మన హైందవ సంస్కృతికి, సంప్రదాయానికి విరుద్ధం."

"మీకు మరీ సెంటిమెంట్స్ ఎక్కువ."

"అయితే నీలో లోపముంటే—నిన్ను కాదని మరో పెళ్ళి చేసుకోనంటావా?"

"చేసుకున్నా నా కభ్యంతరం లేదు. కాని అది గత్యంతరం లేని ప్రాచీన పద్ధతి. ఇప్పుడు శాస్త్ర విజ్ఞానం పెరిగింది గనుక. . ."


"శాస్త్రమా? వంకాయా? నువ్వెన్ని చెప్పు ఈ ఆధునిక పద్ధతులు సక్సెస్ కావు. వీటిని దేవుడు మెచ్చడు. మనకి అంతకీ పిల్లలు పుట్టకపోతే ఎవరినయినా తీసుకొచ్చి పెంచుకుందాం."

"మీ ఇష్టం. . .ఇంతకీ ఈ రాత్రికి మీ లెక్క తేలదా?" ఆమె నీలి కళ్ళలో కాంక్షల మెరుపు తీగలు.


"ఎన్నిసార్లు లెక్కపెట్టినా పది ఎక్కువో, తక్కువో వస్తూంది. నువ్వు కొంచెం సాయం చేస్తావా?"

"నావల్ల కాదు, బాబూ. అయినా, అంత మొత్తంలో పది లెక్కేముంది? పొద్దుట బాంకువాళ్ళ మొహాన కొడితే వాళ్ళే చూసుకుంటారు."

పురుషోత్తం అయిష్టంగానే సొమ్ము ఇనప్పెట్టెలో పెట్టి తాళం బిగించి లేచాడు. గదిలో అగరొత్తుల గుబాళింపు. . . టూ ఇన్ వన్‌లో సన్నగా డిస్కో మ్యూజిక్. . .పరుపు నిండా 'స్ప్రే' ల పరిమళం... దేవి కళ్ళలో కవ్వింపు. . .ఫోమ్‌బెడ్ మీద చోటు



INNOVATION/AP/TEL/01-A




చూపిస్తూ పక్కకి జరిగింది.

"దేవీ, ఈ రోజు స్వామి వ్రతం చేసుకున్నాం. బెడ్ మీద పడుకోవడం. . ."

"అబ్బా...మీకంతా చాదస్తమే" పురుషోత్తాన్ని మీదకు లాక్కుంటూ లైటాఫ్ చేసింది దేవి.

ఆ తర్వాత వారం రోజుల్లోనే దేవి, పురుషోత్తం తిరుపతి, వెల్లూరు వెళ్ళి స్వామి దర్శనం, యోగి దర్శనం చేసుకున్నారు. పురుషోత్తం స్వామికి తల నీలాలు సమర్పించాడు.

మూడు నెలలు తిరక్కుండానే దేవి తల్లి కాబోతోందని తెలిసిన పురుషోత్తం ఆమెను ముద్దుల్లో ముంచెత్తాడు. 'ఇప్పుడేమంటావు?' అన్నట్టు గర్వంగా చూశాడు. "స్వామిదయ" దేవి కళ్ళల్లో సిగ్గు దొంతరల దోబూచులు. . .!

### 3

"హాయ్, గుడ్‌మార్నింగ్ పుం"

"వెరీ గుడ్‌మార్నింగ్ దే..."

"ఈ రోజు మన పెళ్ళి రోజు. గుర్తుందా, డియర్?"

"సిల్లీ దే—ఈ రోజును మర్చిపోతావా? అప్పుడే ఏడేళ్ళు ఏడు క్షణాల్లా గడిచిపోయాయి. నిజానికి మనకి నిన్న మొన్న పెళ్ళయినట్టు లేదూ?"

"పాపం. ఇంకా మూడు రాత్రులూ కాలేదన్నారు కారు అబ్బాయిగారు. ఈసరికి సంతాన వర్షం ప్రారంభిస్తే అర డజను మందికి అమ్మానాన్న అయి ఉండేవాళ్ళం."

"మొదటి వాలుగేళ్ళు 'నో అడ్మిషన్' బోర్డు మనం పెట్టాం. ఆ తర్వాత ఎవరూ జాయిన్ కావడానికి రావడం లేదు. చిత్రంగా ఉంది కదూ."

"అందుకే మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తాడన్నారు. వద్దంటే పిల్లలు కలిగే ఈ రోజుల్లో ఇన్నేళ్ళూ మనకు సంతానం కలగక పోవడం...? మనలో లోపముందని నా అనుమానం."

"యుయూ—సిల్లీ దే. ఏదో ప్రాచీన కాలంలా బాధపడిపోతావేమిటి? ఇంతవరకు అవసరం లేదనుకున్నాం. ఇప్పుడు కావాలనుకుంటున్నాం గనుక ఆ లోపమెక్కడో కనుక్కుందాం. ఇది నా పెళ్ళి రోజు నిర్ణయం."

ఇంతలో దే ఆజ్ఞను పురస్కరించుకొని రొబట్ (మరమనిషి) కాఫీలు తీసుకొచ్చి ఇచ్చాడు.

"కనుక్కొని ఏం చేద్దామని నీ అభిప్రాయం?" కాఫీ సిప్ చేస్తూ అడిగింది దే.

"ఏముంది?—వెరీ సింపుల్. ఇప్పుడు 'డయాగ్నసిస్' కోసం డాక్టర్ల దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం కూడా లేదు కదా? టెస్టింగ్‌కి కంప్యూటర్ చాలు. నీలో లోపముంటే 'టెస్ట్ ట్యూబ్ బేబీ' నాలో లోపముంటే 'ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్'—ఏ పద్ధతి అవసరమైతే అది అమలు చేద్దాం."

"నాలో లోపముంటే ఫర్వాలేదు. కాని నీలో లోపముంటే కృత్రిమ వీర్య సంపర్క విధానమంటే. . నాకు అలర్జీ. . .మనస్కరించడం లేదు. . .పైగా ఆయామ్ నాట్ పర్టిక్యులర్ ఎబవుట్ చిల్డ్రన్."

"యుహా. . .పూర్ సెంటిమెంటల్ గర్ల్—అమలాపురం ఆడపిల్లనిపించావు. నువ్వు వద్దన్నా నేనొప్పుకోను. . .అయినా లోపమున్నదో తేలాలిగా. . అప్పుడు ఆలోచిద్దాం. కమాన్—గెటప్" దే కి చెయ్యి అందించి బెడ్ మీద నుంచి హుషారుగా లేవాడు 'పుం.'

దే, పుం—21వ శతాబ్దంలో కొనసాగిన ఒక మల్టీ స్టోరీడ్ బిల్డింగ్‌లో టెన్త్ ఫ్లోర్‌లో ముప్ఫై మూడవ అపార్ట్‌మెంట్‌లో సంసారం చేసుకుంటున్న యువతీ యువకులు.

'సెమన్ టెస్ట్'లో 'నెగటివ్' ఫలితం రావడంతో 'ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్' కోసం 'దే' ని ప్రోత్సహించాడు పుం. మొదట్లో ప్రతిఘటించినా చివరకు 'పుం' ని నిరాశపర్చడం ఇష్టం లేక 'దే' అంగీకరించింది. వెంటనే రాజధానిలో ఉండే వేంధావుల 'సెమన్ బ్యాంక్' కి పుం, దే—ఆ అంతస్తు నుంచే 'ఎయిర్ స్కూటర్' మీద బయల్దేరారు.

"గత శతాబ్దంలో కూడా ఇంత దూరం బస్సులోనూ, రైళ్ళలోనూ వెళ్ళేవారట మన తాత ముత్తాతలు. పాపం చాలా కష్టం కదూ. జీవితంలో సగం కాలం వాళ్ళకి ప్రయాణాలకే సరిపోయేదేమో" స్కూటర్ వెనక కూర్చున్న దే అడుగుతోంది.

"వాళ్ళు మనలాగే ఎగిరేవాళ్ళను చూసి కాశీకైనా కాలి నడకనే పోయేవారని జాలి పడేవారట."

"ఏమైనా ఈ కాలంలో పుట్టడం మన అదృష్టం."

ఎయిర్ స్కూటర్ పుష్పక విమానంలా గాలిలో తేలిపోతోంది. . .!

● ● ● ●

ఎనిమండుగురు భార్యలను పెళ్ళాడినా సంతానం కలగకపోవడానికి లోపం తనదని గుర్తించని అధికారాంధుడు వీర పురుషోత్తమవర్మకి — పర పురుష ప్రవేశానికి ఆస్కారం లేని అంతఃపురంలో రాగరాగిణిదేవి చారుమతి సహాయంతో వెల తప్పినట్టు నటించి పురుడు సమయానికి ఒక మగ నలుసుని తెప్పించి తనే కన్నట్టు మోసగించిందని తెలియదు!

శాస్త్ర విజ్ఞానం ద్వారా సంతానం పొందడం అపచారమని అది భార్య పాతివ్రత్యానికి కళంకమని భావించే పురుషోత్తానికి — తనకు సంతానాన్ని ప్రసాదించే శక్తి లేదనీ, మాతృత్వ వాంఛతో పరితపించిపోయిన దేవి సత్యనారాయణవ్రతం సందర్భంగా కలిసిన కాలేజీలో క్లాస్‌మేట్, తనంటే ప్రాణం పెట్టే ఆరాధకుడూ కృష్ణ ద్వారా ఆ కోర్కె తీర్చుకొని అది స్వామి ఆశీర్వచన ఫలమని నమ్మపెట్టిందనీ తెలియదు.

కాని 'పుం' గారికి తెలుసు —

ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త 'మాన్' సెమన్ వల్ల 'దే' కి జన్మించిన 'రే' తన రక్తం పంచుకున్న బిడ్డ కాదని!

వాలుగేళ్ళ వయసులో ఉన్న 'రే' పుం కంప్యూటర్ సహాయంతో తెలుసుకుంటున్న ఫలితాలను సునాయాసంగా నోటి లెక్కన చెప్పేస్తున్నాడు.

"ఇంత తెలివి తక్కువవాడివి. . .నువ్వు నా డాడీ వంటే నమ్మలేకపోతున్నాను.." ఎగతాళి చేస్తున్నాడు 'రే'.

"యుహా నాటీ—మై స్వీట్ సన్! లేని పుత్ర వాత్సల్యంతో ముద్దులాడుతున్నాడు పుం. . .! ★